క్లుప్తంగా

సీతారాంపురంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో గల గీతా మందిర్ (గోవింద క్షేత్రం)లో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో నిర్వాహకులు బండారు కుశలయ్య, చీదెళ్ల వెంకటేశ్వర్లు, వేణు, మట్టయ్య, వెంకటదుర్గ ప్రసాద్, యాదగిరి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, నారాయణరావు, రామారావు, శివకుమార్, సాంబమూర్తి, లక్ష్మీనారాయణ, రాము, లింగయ్య తదితరులున్నారు.

అడవిదేవులపల్లి ఇంచార్జి ఏఓగా సైదానాయక్

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల ఇంచార్జి ఏఓగా సైదానాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఏఓ అర్చన సెలవులపై వెళ్లడంతో మాడుగులపల్లి మండల వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న సైదానాయక్‌కు అడవిదేవులపల్లి మండల ఇంచార్జి ఏఓగా బాధ్యతలు అప్పగించారు.

ఇంచార్జి ఎంపీడీఓగా విజయకుమారి

త్రిపురారం : అనుముల మండల ఎంపీడీఓ విజయ కుమారి త్రిపురారం మండల ఇంచార్జి ఎంపీడీఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ సత్యప్రభ ఇంచార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ లాంగ్ లీవ్‌పై వెళ్లారు. దీంతో విజయ కుమారి ఇంచార్జి ఎంపీడీఓగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీఓ కొడిరెక్క రాజేందర్, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ డిండి అధ్యక్షుడిగా షేక్ ఉమర్



షేక్ ఉమర్

డిండి: డిండి పట్టణ ముస్లిం మైనార్టీ నూతన కమిటీని మండల కేంద్రంలోని షాదీఖానాలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఉమర్, గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ రఫీద్, ఉపాధ్యక్షుడిగా షేక్.చాంద్‌పాషా, ప్రధానకార్యదర్శిగా మహ్మద్ ఖయ్యూం, సహాయ కార్యదర్శిగా నజీర్, కోశాధికారిగా ఇస్మాయిల్, ముఖ్య సలహాదారులుగా హఫీజ్, షబీర్, ఖాదర్, మనోద్దీన్, అన్వర్‌ను ఎన్నుకున్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొండమల్లేపల్లి : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి సూచించారు. బుధవారం ఆటో డ్రైవర్లకు పోలీసు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తాటి చెట్టుపై పిడుగు

గుర్రంపోడు : మండలంలోని బుధవారం రాత్రి వర్షం కురిసింది. ఈ క్రమంలో మండల కేంద్రం శివారులోని శాంతి నగర్ వద్ద తాటి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. దీంతో నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనదారులతోపాటు గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

కట్టా మమతకు మండలి చైర్మన్ నివాళి



మమత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తదితరులు

మాడుగులపల్లి : మండలంలోని మద్రిగూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కట్టా మమత అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బుధవారం ఆమె దశదిన కర్మను కుటుంబీకులు స్వగ్రామంలో నిర్వహించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై మమత చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

మిర్యాలగూడలో భారీ వర్షం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణం, మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. దీంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ ఈదురుగాలులకు వైర్లు తెగిపోవడంతో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పంచాయతీల్లో నిధుల కొరత

- నాలుగు నెలలుగా నిలిచిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు
- ఐదు నెలలుగా నయాపైసా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఏడు నెలలుగా జీతాల్లేవని కార్మికుల ఆవేదన
- పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి



తిరుమలగిరి గ్రామపంచాయతీ కార్యాలయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామ పంచాయతీల్లో పాలన నిలిచిపోయింది. సర్పంచుల పదవీకాలం ముగిసిపోయి ప్రత్యేక అధికారులు రావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిధులు లేక, పనులు చేయించలేక పంచాయితీ కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొత్తగా పంచాయితీలుగా ఏర్పడిన తండాల్లో అయితే ట్రాక్టర్ కిస్తీలు కట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. మండలంలోని 34 పంచాయితీల్లో ఒకటి, రెండు పంచాయతీలు మినహా అన్నింట్లో నిధులు లేమి కనబడుతోంది.

పంచాయతీలకు అందని నిధులు

మండలంలో మూడు, నాలుగు గ్రామాలు మాత్రమే ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నెల నెలా వేసే నిధులతో ఇంతకాలం పంచాయతీలను కార్యదర్శులు నెట్టుకొచ్చారు. నాలుగు నెలల నుంచి కేంద్రం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయడం లేదు. ఇక రాష్ట్ర ప్రభుత్వ వాటా అయితే గత ప్రభుత్వ హయాంలోనే నిలిపివేయగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయ కూడా విడుదల చేయలేదు. రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులు ఏడాది నుంచి రావడం లేదు. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. సర్పంచుల వారి పదవీ కాలంలో అప్పులు తెచ్చిమరి అభివృద్ధి పనులు చేయించారు. అవి ఇప్పటి వరకు మంజూరు కాకపోవడంతో తాజా మాజీ సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలవారీ బిల్లులకు ఇబ్బందులే..

పంచాయితీల్లో ప్రతి నెలా పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు, ట్రాక్టర్ల కిస్తీలు, విద్యుత్ దీపాల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, తాగునీటి పైపుల మరమ్మతులు తదితర పనులకు కచ్చితంగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మండలంలో దాదాపు మూడు వంతుల పంచాయతీల్లో జనరల్ ఫండ్ రూ. పదివేలు కూడా లేకపోవడంతో సదరు బిల్లులు చెల్లించలేక చేతులెత్తేశారు.

బ్లీచింగ్‌కు కూడా కష్టమే..

వానాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో దోమల బెడద లేకుండా చేయడానికి కనీసం వీధుల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేదు. కొన్ని గ్రామాల్లో తాజా మాజీ సర్పంచులే ఇప్పటికీ బాధ్యతలు చూస్తున్నారు. చిన్న చిన్న పనులు వాళ్లే చేయిస్తున్నారు. మరోవైపు పంచాయతీల ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టి కనీసం గ్రామాలవైపు కూడా తిరిగి చూడటం లేదు.

సొంతంగా చెల్లిస్తున్నాం



"కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నాలుగు నెలల నుంచి రావడం లేదు. గ్రామపంచాయతీలో చేసే ప్రతి పనికి అవసరమయ్యే ఖర్చు సొంతంగా చెల్లించాల్సి వస్తుంది. గ్రామపంచాయితీల్లో అభివృద్ధి కూడా కుంటుపడుతోంది.

– జనార్దన్, పంచాయతీ కార్యదర్శి, పిల్లిగుండ్లతండా

ఏడు నెలలుగా జీతాలు లేవు



"ఏడు నెలల నుంచి జీతాలు రావడం లేదు. గ్రామపంచాయతీలో డబ్బులు లేకపోవడంతో జీతాలు ఇవ్వలేక పోతున్నాం అని పంచాయతీ కార్యదర్శి చెపుతున్నాడు. ఏడు నెలల నుంచి జీతాలు లేకుండా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి.

– రాము, పంచాయతీ వర్కర్, నాగార్జునపేటతండా

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి అన్నారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాల, వెంకటాపురం, ఆరెగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. గుర్రంపోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొనేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గుర్రంపోడు మండలంలో కోటి రూపాయలతో 30 పాఠశాలల్లో కరెంటు, మరుగుదొడ్లు, మంచినీటి తదితర మౌలిక వసతుల పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. వెంకటాపురం (కె) ప్రాథమిక పాఠశాలలో చొరవతో పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా జరిపిస్తున్న హెచ్‌ఎం మారం జగదీశ్వర్‌రెడ్డిని జెడ్పీ సీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ తరి రాము, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నోముల యాదగిరి, అయిటిపాముల యాదగిరి, డీఈఈ శైలజ, ఏఈ రవికుమార్ ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో త్రిపురారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఆలంపల్లి జానయ్య, చిలుముల శ్రీనివాస్, కామర్ల జానయ్య యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నారని తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం డిజిటల్ తరగతులను పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించి ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంఈఓ బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయులు లావూరి బాలు, వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, మైబెల్లి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ

వేములపల్లి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శెట్టిపాలెం జెడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. అనంతరం శెట్టిపాలెం శివారులో నూతనంగా నిర్మించిన సారా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీతకృపయ్య, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, ఎంపీటీసీ పల్లా వీరయ్య, ఎంఈఓ బాలాజీనాయక్, నోడల్ అధికారి లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లా వెంకటయ్య, పల్లా సోమమ్మ, కృపయ్య పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ పెద్దపీట వేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు, తొలిరోజు హాజరు వంటి విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ మారుపాకుల సురేష్‌గౌడ్, ఎంఈఓ మాత్రు నాయక్, పల్లా నరసింహారెడ్డి, రహత్‌అలీ, యూనుస్, కిన్నెర హరికృష్ణ, శిరందాసు కృష్ణయ్య, గాజుల మురళి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులకు సూచించారు. బుధవారం దేవరకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్, ఈడబ్ల్యూఐడీసీ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎస్‌ఈలు, ఈఈలు, డీఈలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఆయా శాఖల పరిధిలోని రోడ్లు, బిల్డింగ్‌లు, కొత్తగా మంజూరై టెండర్ల స్థాయిలో ఉన్న పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా కూడా అలసత్వం వహించకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, డీఈలు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని కొండభీమనపల్లి గ్రామానికి చెందిన 57మంది అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం పట్టణ శివారులోని డబుల్ ఇళ్లను పరిశీలించారు. జూలై 12నాటికి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ అరుణసురేష్, మున్సిపల్ చైర్మన్ నర్సింహ, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, పల్లా నరసింహారెడ్డి తదితరులున్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ : ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను అర్హులైన ఎస్సీ యువత సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.సైదులు తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నైపుణ్య అభివృద్ధి శిక్షణ సెంటర్ ఫర్ నర్సెస్ వారు పదో తరగతి విద్యార్హతతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇంటర్ అర్హతతో డైలీసిస్ టెక్నిషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు రెడ్డికాలనీ పాత బ్రిలియంట్ పాఠశాలలో, 9848581100, 9515651160 నంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రీజనికి ఎమ్మెల్సీ అభినందన



శ్రీజనిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా : అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కోరేపాక ఆంజనేయులు, చైతన్య దంపతుల కుమార్తె శ్రీజని జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 44 ర్యాంకు సాధించింది. బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాలియాలో ఆ విద్యార్థిని శ్రీజని, తల్లిదండ్రులను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుబ్బ శివాజీ ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



కొండమల్లేపల్లి : వివరాలు సేకరిస్తున్న అధికారులు

అడవిదేవులపల్లి : మిషన్ భగీరథ పథకంపై మండలంలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంపీఓ మోహసిన్ బిన్, అహ్మద్ మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలంలోని అన్ని గామ పంచాయితీల్లో ఈ సర్వే జరుగుతుందని, ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం తాగునీటి సరఫరాపై సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో బుధవారం మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించారు. మిషన్ భగీరథ ఉంటే సంబంధిత యాప్‌లో కుటుంబ వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఈ నాగేష్, ఏఈ మాల్యాద్రి, గ్రామ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఫుడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు

మిర్యాలగూడ టౌన్ : ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించేందుకు మున్సిపాలిటీలో ఫుడ్‌సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. బుధవారం స్థానిక చాంబర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఆజ్మీరా కిరణ్, పర్యావరణ ఇంజనీరు శ్వేతారెడ్డిలతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ మున్సిపాలిటీ పరిధిలో గల హోటళ్లు, బేకరిలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను నిత్యం తనిఖీ చేస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పనులు సజావుగా సాగే విధంగా అకౌంట్ సెక్షన్లలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు హనుమాన్ ప్రసాద్, ఎంఏ షహబాజ్, సబార్డినేటర్ గామణికి బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ



అడవిదేవులపల్లి : యూనిఫాం అందజేస్తున్న అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ బైరం విజయలక్ష్మి



కొండమల్లేపల్లి : జెడ్పీహెచ్ఎస్‌లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు బుధవారం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోలి కృష్ణ, ఎంపీటీసీ దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయన్న, పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, చైర్మన్ పద్మ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాం, నోట్ పుస్తకాలను అమ్మ అదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బైరం విజయలక్ష్మి, ఎంపీడీఓ కరుణాకర్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ మెహిసెన్, హెచ్‌ఎం అబ్బాస్ అలీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, కవిత, నీలియా, అంకిరెడ్డి, ప్రవీణ, సురేష్‌కుమార్, మునీశ్వరీ, శోభ, పార్వతి, వాజిద్‌అలీ, చంద్రకళ, సోమలింగం, శ్రీనయ్య, సహదేవ, హిమ బిందు, లలిత, సైదా తదితరులున్నారు.

పనులు పరిశీలన

అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అమ్మ అదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పనులను ఎంపీడీఓ కరుణాకర్ రావు పరిశీలించారు.వారి వెంట ఎంపీఓ మోసిన్ తదితరులున్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

నిడమనూరు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తొలి రోజు విద్యార్థులకు యూనిఫాం, నోట్, ప్యా పుస్తకాలను పంపిణీ చేశారు. తొలిరోజు, యాభై శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ బాలునాయక్ తెలిపారు.

డిండి: ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మాధవరం సునితాజనార్దన్ రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపధ్యాయులకు పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్,యూనిఫాం అందజేసారు. కార్యక్రమంలో ఎంపీడీగో డానియల్, ఎంపీటీసీలు ఏటి.రాధికాకృష్ణ, బి.వెంకటయ్య, ఎంఈఓ సామ్యా నాయక్ పాల్గొన్నారు.

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ ధనావత్ భారతి అన్నారు. మండల కేంద్రంలో విద్యానగర్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రిపురారం మండల ఎంఈఓ బాలాజీ నాయక్, ప్రధానోపాధ్యాయులు కర్నాటి వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి రవి నాయక్, ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ధనావత్ భాస్కర్ నాయక్, పడిశల మంగమ్మ పాల్గొన్నారు.

మోగిన బడి గంట

కొండమల్లేపల్లి : నూతన విద్యా సంవత్సరం బుధవారం ప్రారంభమైంది. కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎం చేరుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వస్కుల సుమలత, సుముద్రాల శ్రీనయ్య, కొర్ర లోక్యనాయక్, జగదీష్, జనార్దన్ రెడ్డి, అక్కిరెడ్డి, దేవకుమార్, శ్రీపతిరావు, సైదానాయక్, సూర్య, లింగారెడ్డి, సీతారాం, గోవర్ధన్‌రెడ్డి, నరసింహారావు, నాగేంద్ర పాల్గొన్నారు.

గుర్రంపోడు : పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ బుక్స్‌ను సద్వినియోగం చేసుకొనేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిట్టలగూడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం గీత అన్నారు. బుధవారం పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంజుల, కత్తి యాదగిరిరెడ్డి, వీరస్వామి, శేఖర్ పాల్గొన్నారు.



డిండి: పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ సునిత



నిడమనూరు : పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న నోడల్ అధికారి వెంకన్న



త్రిపురారం : విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న జెడ్పీటీసీ భారతి

తొలిరోజు హాజరు అంతంతే..



డిండి : జెడ్పీహైస్కూల్లో తాళం వేసి ఉన్న తరగతి గది

మాడుగులపల్లి : వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు మాడుగులపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 20 శాతం కంటే తక్కువ హాజరుశాతం నమోదైంది. మండలంలో 41ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. తొలిరోజు కేవలం 600 మంది మాత్రమే హాజరైనట్లు మండల విద్యాధికారి తెలిపారు. పలు పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఉపాధ్యాయులు విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

మొదటి రోజు పది శాతమే ..

పెద్దవూర: పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజు బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు హాజరు అంతంతగానే ఉంది. బుధవారం తిథి షష్టి కావడంతో పాఠశాలలకు విద్యార్థులను పంపడానికి తల్లిదండ్రులు ఉత్సాహం చూపలేదు. మండలంలో 55 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు కలిపి 68 ఉన్నాయి. ప్రైవేటు, గురుకుల వంటి పాఠశాలలు కలిపితే మొత్తం 93 ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి 9వేల మంది విద్యార్థులు ఉండగా పది శాతం మంది కూడా హాజరు కాలేదు.

బడులు తెరిచినా హాజరు కాని విద్యార్థులు

డిండి: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు తెరిచినప్పటికీ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక బోసిబోయాయి. కొన్ని పాఠశాలలకు విద్యార్థులు హాజరు కాక పోవడంతో తరగతి గదులకు తాళాలు కూడా చేయలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు హాజరైనప్పటికీ ఉదయం 11 గంటల వరకు ఒక్క విద్యార్థి కూడా హాజరుకాలేదు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్

- మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ: ప్రభుత్వ, చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తామని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా చెరువుల సర్వే నిర్వహించి బౌండరీలను ఏర్పాటు చేస్తామన్నారు. మట్టి, ఇసుకదందా చేస్తే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని సైతం స్వాధీనం చేసుకుని బౌండరీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనుమతి లేకుండా బోర్ వేస్తే బోర్‌వెల్‌తోపాటు బోర్లను సీజ్ చేస్తామని, పర్మిషన్ తీసుకుని బోర్లు వేయాలన్నారు.

అందుబాటులో అధికారులు

నేటి నుంచి ఉదయం 9గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభమయ్యాయని, విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి సర్టిఫికెట్‌కు చెల్లించే ధరల పట్టికను ఏర్పాటు చేశామని, మీ సేవ కేంద్రాల్లో ఎవరైనా దళారులు నిర్ణీత ధరకు మించి డబ్బులు వసూలు చేసినట్లు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సర్టిఫికెట్ల కోసం నేరుగా తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, డీఏఓ జ్యోతి ఉన్నారు.